నకిలీ వస్తువులపై ఆరా

ప్రజాశక్తి-పాడేరు:సంతల్లో నకిలీ వస్తువులు అరికట్టాలని గిరిజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోనంగి చిన్నయ్యపడాల్ కోరారు. సోమవారం మండలంలోని అన్నవరం సంతలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాంగి ధనుంజయ్, బాబుతో కలిసి సంతలో నకిలీ వస్తువులను గుర్తించారు. తినుబండారాలు, సబ్బులు, కారం, నూనెతో పాటు అనేక రకమైన వస్తువులు గిరిజనులు కొనుగోలు చేసి రోగాల బారిన పడుతున్నారన్నారు. అధికారులు పట్టించుకోలేదని మండిపడ్డారు.

సంతలో వస్తువులు పరిశీలిస్తున్న నాయకులు

పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్లపై చర్యలు

-జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు:నిర్దేశించిన సమయంలోపు పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో వివిధ పథకాల కింద చేపట్టిన రోడ్డు నిర్మాణ పనుల ప్రగతిని పిఐయు ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ, గత అక్టోబర్‌లో నిర్వహించిన సమీక్షలో పనుల పూర్తికి దిశా నిర్దేశం చేసినప్పటికీ కొన్ని పనులలో ప్రగతి కనబడకపోవటం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. సకాలంలో పని పూర్తి చేయని కాంట్రాక్టర్లకు ఐదు లక్షల రూపాయలు పెనాలిటి విధించాలని కార్యనిర్వాహక ఇంజినీర్ లావణ్య కుమార్‌ను ఆదేశించారు. ఆయా కాంట్రాక్టర్లతో మాట్లాడి సమయాల్ని నిర్దేశించాలన్నారు. నిర్దేశించిన సమయంలో సంబంధిత పనిని పూర్తి చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆదేశించారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి నిధులు, ప్రాజెక్ట్ అమలు విభాగం నిధులతో పాడేరు డివిజన్ పరిధిలో చేపట్టిన పనులపై తగు సమయం నిర్దేశించారు. జి.కె వీధి మండలంలో పనులు ప్రారంభించక పోవటం పట్ల అసహనం వ్యక్త పరచిన కలెక్టర్ డిఇకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షలో ఉప కార్య నిర్వాహక ఇంజినీర్లు బి.రవికుమార్, డి.రవికుమార్, ఈశ్వరరావు, కళ్యాణ్, సహాయ ఇంజినీర్లు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ఎమ్మెల్యేను నిలదీస్తున్న గ్రామస్తులు

ఎమ్మెల్యే ఫాల్గుణకు నిరసన సెగ

ప్రజాశక్తి-అనంతగిరి: ప్రభుత్వం అభివృద్ధి ఎక్కడ చేస్తుందని గడపగడపకు వెళ్లిన ఎమ్మెల్యే శెట్టి పాల్గుణకు నిరసన సెగ తగిలింది. మండలంలోని ఎగువశోభ పంచాయతీ పరిధి కొత్తవలస, హెక్టగుడ, మర్దగూడ , జామగుడ. తదితర గ్రామాల్లో గడప గడప కార్యక్రమం నిర్వహించారు.కొత్తవలస గ్రామంలో గడప గడపకు వెళ్లిన ఎమ్మెల్యేకు నిరసన సెగ తగిలింది. గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలు వైసీపీ ప్రభుత్వం ఎందుకు అమలు చేయలేదని, మృతి చెందిన కుటుంబాలకు వైఎస్ఆర్ బీమా ఏది అంటూ నిలదీశారు. డిగ్రీ చదివిన తన కుమారుడు అనారోగ్యంలో మృతి చెందితే ఇప్పటికే వైఎస్ఆర్ బీమా అందలేదని గెమ్మెల. పెంటన్న ప్రశ్నించారు.పింఛన్ల తొలగింపుపై పింఛనుదార్లు నిలదీచారు. ఎక్కడ అభివృద్ధి చేశారని ప్రశ్నించారు.అనంతరం ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలపై ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొర్రా సింహాద్రి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి తోటలను నరికివేస్తున్న పోలీసులు

రూ.5 కోట్ల విలువైన గంజాయి తోటలు ధ్వంసం

ప్రజాశక్తి-సీలేరు

ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లో సాగులో ఉన్న సుమారు రూ.5 కోట్లు విలువైన గంజాయి తోటలను పోలీసులు ధ్వంసం చేశారు. ఏవోబీలోని మల్కన్‌గిరి జిల్లా కలిమెల బ్లాక్ పరిధిలో గుర్రలూరు, కమలపోదర్, కుర్మనూర్ గ్రామాల్లో సాగవుతున్న 40 ఎకరాలు గంజాయి తోటలను ఆది, సోమవారాల్లో రెండు రోజులు పాటు ధ్వంసం చేశారు. ఈ మూడు గ్రామాల్లో సుమారు 50 వేలు మొక్కలను ధ్వంసం చేసినట్లు ఒడిశా పోలీసులు తెలిపారు. ఇటీవల పోలీసు చర్యలు వల్ల మావోయిస్టులు ప్రభావం ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో తగ్గడంతో గంజాయి సాగు, రవాణాపై దృష్టి సారించామని చెప్పారు. గంజాయి సాగు చేస్తున్నట్లు సమాచారం ఉంటే తమకు వెంటనే సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని వెల్లడించారు. అత్యాధునిక పరికరాలు డ్రోన్ కెమెరాలు ఉపయోగించి గంజాయి తోటను గుర్తించి కూకటి వేళ్లతో పకిలిస్తామని ఒరిస్సా పోలీసులు వెల్లడించారు.

హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతుల రద్దుకు

సిఎం జగన్ ప్రకటన చేయాలి

ఎపి గిరిజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిన్నయ్య పడాల్

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా చింతపల్లి, కొయ్యూరు మండలాల సరిహద్దున ఎర్రవరం ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతులు సిఎం జగన్ రద్దు చేయాలని ఏపీ గిరిజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, హైడ్రో ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ బోనంగి చిన్నయ్య పడాల్ వెల్లడించారు. అల్లూరి జిల్లా పాలకపక్ష నేతలు హైడ్రోపై గిరిజనుల వ్యతిరేకతను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లాలని ఆయన డిమాండ్ చేశారు. గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాంగి ధనుంజయతో కలిసి రెండు రోజులపాటు ఆయన ఎర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్టు బాధిత గ్రామాలను సందర్శించి అక్కడ గిరిజనులతో ఎర్రవరంలో సమీక్షించారు. ఈ మేరకు సోమవారం చిన్నయ్యపడాల్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ హైడ్రో పవర్ ప్రాజెక్టుకు క్యాబినెట్ ఆమోదం ద్వారా అనుమతుల కల్పనపై తీసుకున్న నిర్ణయాన్ని ఈనెల 29న నర్సీపట్నం వస్తున్న ఏపీ సీఎం జగన్ వెనక్కి తీసుకుంటామని ప్రకటించాలని డిమాండ్ చేశారు. గిరిజనుల మనుగడకు ఆధారమైన అడవులు కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఎర్రవరం హైడ్రోపవర్ ప్రాజెక్టుపై గిరిజనులు తమ హక్కుల్ని, అడవుల్ని కాపాడు కోవడం కోసం పోరాటం చేస్తుంటే కనీసం రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమని అన్నారు. ఈ ప్రాంతంలో 32 గిరిజన గ్రామాలు ఉన్నాయని తెలిపారు. 5వ షెడ్యూలు ప్రాంతమంతా గిరిజనుల ప్రాంతమే అనే విషయాన్ని గుర్తుంచుకోవాలని, ఇక్కడ గిరిజనులకే హక్కు ఉందని, అంతే తప్ప ఏ ప్రభుత్వానికి హక్కు లేదన్న విషయాన్ని గుర్తు చేసుకోవాలని చెప్పారు.1995లో అనంతగిరి మండలంలోని గ్రానైట్ క్వారీ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన జడ్జిమెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించాలని సూచించారు. గిరిజన సలహా మండలిలో ఆమోదం పొందకుండా గవర్నర్ ఆమోదం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకున్న ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతగిరి మండలంలో రెండు ప్రాజెక్టులు, విజయనగరంలో ఒక ప్రాజెక్టుల నిర్మాణంతో గిరిజన ప్రాంతమే నాశనమవుతుందన్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డి పర్యటన దృష్ట్యా గిరిజన బాధితుల గోడును విన్నవించుకోవడానికి పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాధిత గిరిజన గ్రామాల ప్రతినిధులు బాలన్న, చినరాజు, వెన్నస్వామి, మంగరాజు, రాజు, ఇతర గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

స్థానిక గిరిజనులతో మాట్లాడుతున్న చిన్నయ్యపడాల్

అర్జీలు స్వీకరిస్తున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే, ఇతర అధికారులు

'స్పందన' సమస్యలను పరిష్కరించాలి

ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి - రంపచోడవరం

స్పందనలో దరఖాస్తులు వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ఐటిడిఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పిఒతో పాటు సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఐటీడీఏ ఏపీఓ సిహెచ్ శ్రీనివాసరావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. 28 దరఖాస్తులు వచ్చాయి. ఉపాధి హామీ పనులు కల్పించాలని, తాగునీటి బోర్లు, ఆర్ అండ్ బి రోడ్డు వరకు సీసీ రోడ్డు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని దేవీపట్నం మండలం గంగంపాలెం గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. కొండపోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని రంప గ్రామానికి చెందిన నేర్రం స్వామి విజ్ఞప్తి చేశారు. దేవిపట్నం మండలం ఏనుగుల గూడెం గ్రామానికి చెందిన బొరగా నాగరాజు దొర వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. మెట్టగూడెం గ్రామస్తులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని పూనెం శుభలక్ష్మి దరఖాస్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి.డేవిడ్ రాజ్, నాగేశ్వరరావు, వెలుగు ఏపిడి ఎ.శ్రీనివాసరావు, ఏడిఎంహెచ్‌వో డాక్టర్ అనూష, డాక్టర్ రాధిక పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ లక్ష్మి, ఎంపిటిసి ప్రదీప్‌కుమార్

అనారోగ్యంతో మాజీ ఎంపిపి మృతి

ప్రజాశక్తి-అనంతగిరి:మాజీ ఎంపీపీ శోభ వీరభద్రరాజు (86) అనారోగ్యంతో కన్నుమూశారు. కొన్ని రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతూ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో వైద్య సేవలు పొందినప్పటికీ ఆరోగ్యం విషరించి సోమవారం మధ్యాహ్న సమయంలో తన స్వగ్రామమైన భీమవరం గ్రామంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. పంచాయతీ సర్పంచ్ మొదలుకొని ఎంపీటీసీ, జెడ్పిటిసి, ఎంపీపీగా ఎదిగిన ఘనత ఆయనది. ఆయన మృతి చెందడం పట్ల పలువురు రాజకీయ నేతలు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. తన భార్య శోభ తిరుపతమ్మ రొంపల్లి పంచాయతీ ఎంపీటీసీగా ప్రస్తుతం కొనసాగుతున్నారు. కుమారుడు మైదాన ప్రాంతంలో వైద్య అధికారిగా పని చేస్తున్నారు. మంగళవారం స్వగ్రామం భీమవరంలో అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు మంత్రి బొత్స పర్యటన

ప్రజాశక్తి-పెదబయలు: మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఈనెల 27న చేపట్టనున్నారని వైసిపి మండల కన్వీనర్ కొర్ర కనకరాజు తెలిపారు. ఈనెల 27న మంగళవారం ఉదయం జిటిడబ్ల్యు ఆశ్రమ స్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తారన్నారు. అనంతరం సీకరి పంచాయతీ శీకరి నుండి లబ్బెరి, కుడాసింగి రోడ్డుకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అధికారులు, నాయకులు పాల్గొనాలని కోరారు.

మాట్లాడుతున్న కిడారి

టిడిపి హయాంలోనే మన్యం అభివృద్ధి

మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:తెలుగుదేశం హయాంలోనే గిరిజన గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. మండలంలోని గుంటసీమ పంచాయతీలో సోమవారం ఆయన పర్యటించారు. అనంతరం దొరగుడా, శోభూరు గ్రామాల్లో సందర్శించి గిరిజన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు ప్రభుత్వం విస్మరించిందని, రుణమాఫీ గాలికి వదిలేసిందన్నారు.ప్రభుత్వం కాస్మోటిక్ పంపిణీ చేయలేని దుస్థితితో ఉందన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన మరుక్షణమే సిసి రోడ్లు, తాగునీరు, వీధి రోడ్ల డ్రైనేజీలు కల్పిస్తామన్నారు. తొలగించిన రేషన్ కార్డులు, పింఛన్లు పునరుద్ధరిస్తామని చెప్పారు. గిరిజనులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని తెలిపారు. ప్రభుత్వం ప్రజల నుంచి దోచుకుంటుందని విమర్శించారు. అనంతరం ఆ పంచాయతీ బిజెపి నాయకులు టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు, పార్లమెంట్ కోశాధికారి నాగేశ్వరరావు, అరకు పార్లమెంట్ ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు సుబ్బారావు, టిఈఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి స్వామి, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు భాస్కరరావు, పంచాయతీ యువ నాయకులు జక్కయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అండర్-19 వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-కొయ్యూరు

రాష్ట్ర స్థాయి అండర్ -19 బాల బాలికల వాలీబాల్ పోటీలు సోమవారం మండలంలోని శరభన్నపాలెం గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. క్రీడా పతాకాన్ని స్థానిక సర్పంచ్ కిముడు సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అరకు ఎంపీ భర్త, నేను సైతం చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివప్రసాద్ మాట్లాడుతూ ఎంపీ గొడ్డేటి మాధవి ప్రత్యేక చొరవతో, తమ ఫౌండేషన్ ఆర్థిక సహాయ సహకారాలతో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీలకు 13 జిల్లాలకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు. ఈ నెల 26, 27, 28 తేదీల్లో ఈ పోటీలు జరుగుతాయని, ఈ మూడు రోజులు క్రీడాకారులకు వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో 13 జిల్లాలకు చెందిన పిఈటిలు, ఫౌండేషన్ డైరెక్టర్స్ దాడి శ్రీనివాసరావు, సురేష్ పట్నాయక్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా జెండాను ఆవిష్కరిస్తున్న శరభన్నపాలెం సర్పంచ్ సత్యనారాయణ

పరీక్ష కేంద్రం పునరుద్ధరణకు లేఖలు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ ఏడాది పరీక్ష కేంద్రాన్ని పునరుద్ధరించి, ఈ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులు ఏర్పాటు చేయాలని ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్‌కు, పాడేరు ఐటిడిఏ పిఒకు ఈనెల 23 లేఖలు రాసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వినోద్ బాబు వెల్లడించారు. సోమవారం స్థానిక విలేకరులతో సోమవారం మాట్లాడుతూ సీలేరులో 1982లో ఏపీ జెన్కో అధికారులు సౌజన్యంతో ఏర్పాటు చేసిన రేకుల షెడ్డు భవనాల్లో హెచ్ఈసి, సీఈసీ, బైపీసీ, ఎంపీసీ గ్రూపులతో కళాశాల అప్పటి ప్రభుత్వం ప్రారంభించినట్లు తెలిపారు. కళాశాలలో ల్యాబ్‌లు ఏర్పాటు చేయడానికి సరైన భవనాలు లేకపోవడంతో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్ని తొలగించారని, దీంతో ఈ ప్రాంత పేద విద్యార్థులు ఆ గ్రూపులకు దూరమయ్యారని చెప్పారు. కళాశాల శిథిలావస్థకు చేరుకున్నా విద్యార్థులకు అక్కడే తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇటీవల ప్రభుత్వం నాడు నేడు పనుల్లో భాగంగా కళాశాల మరమ్మతులు నిమిత్తం రూ.21 లక్షలు మంజూరు చేసిందని, దీంతో మరమ్మతు పనులు శరవేగంగా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. పరీక్షా కేంద్రాన్ని 2018 వరకు సీలేరులోనే పరీక్ష కేంద్రం ఉండేదని, తరువాత జికె.వీధికి మార్చడంతో సుమారు 50 కిలోమీటర్లు విద్యార్థులు ప్రయాణం చేసి పరీక్షలకు రావాల్సి ఉంటుందని చెప్పారు. అయితే తగ్గ బస్సు సౌకర్యాలు లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ ఏడాది నుంచి సీలేరు కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. బైపిసి, ఎంపీసీ గ్రూపులను ఏర్పాటు చేయాలన్నారు.

సీలేరు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వినోద్‌బాబు

ధాన్యం కొనుగోలు ప్రారంభం

ప్రజాశక్తి-విఆర్.పురం

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని పెదమట్టపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆ పంచాయతీ సర్పంచ్ వెట్టి లక్ష్మి, ఎంపిటిసి పూనెం ప్రదీప్ కుమార్ ప్రారంభించారు. అనంతరం రైతులకు గోనె సంచులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 5000 వేల గోనె సంచులు వచ్చాయని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సేకరిస్తున్న ధాన్యం కొనుగోలులో ఎక్కడా రైతులకు నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులు ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖాధికారి రఘుకుమార్, అగ్రికల్చర్ సిబ్బంది తేజ, నాగు, రామారావు, రైతులు పాల్గొన్నారు.

వంగవీటి రంగా వర్ధంతి

ప్రజాశక్తి- చింతూరు : వంగవీటి మోహనరంగా 34 వర్ధంతి కార్యక్రమం ఆయన అభిమాని సింగంశెట్టి దుర్గారావు ఆధ్వర్యాన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రికెట్ క్రీడాకారులకు 45 జెర్సీలు అందించారు. అనంతరం దుర్గారావు మాట్లాడుతూ నేటి యువత క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని చెప్పారు. జాతీయ అంతర్జాతీయ క్రీడల్లో మన్యం యువకులు రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ క్రీడాకారులు, అభిమానులు పాల్గొన్నారు.

రగ్గులు, చీరల పంపిణీ

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలం, డౌనూరు పంచాయతీ, మల్లంపేట గ్రామంలో స్థానిక ఎంపిటిసి బిడిజన అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో అరకు పార్లమెంట్ సభ్యురాలు గొడ్డేటి మాధవి పాల్గొని మహిళలకు రగ్గులు, చీరలు పంపిణీ చేశారు. చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో ఎంపీ మాధవి పాల్గొన్నారు. అనంతరం పాస్టర్‌లు ఎంపీని దుస్సాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి వార నూకరాజు, సర్పంచులు పొట్టిక భవాని, నూకాలమ్మ, రావుల వెంకటలక్ష్మి, పోతురాజు, సింహాచలం పాల్గొన్నారు.

చీరలు, రగ్గులు పంపిణీ చేస్తున్న ఎంపీ మాధవి

జెర్సీలు అందజేస్తున్న దుర్గారావు తదితరులు

ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలి

ఐటిడిఎ పిఒ గోపాలకృష్ణ

పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న పిఒ రోణంకి గోపాలకృష్ణ

ప్రజాశక్తి-పాడేరుటౌన్:2010 నుండి 2016 సంవత్సరం మధ్య ఆధార్ కార్డు పొందిన వారందరూ ఆధార్ కార్డులను నవీకరణ చేయించుకోవాలని ఐటిడిఎ పిఒ ఆర్.గోపాలకృష్ణ పేర్కొన్నారు. సోమవారం ఆయన కార్యాలయంలో ఆధార్ కార్డ్ అప్డేషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ఆధార్ గుర్తింపు ద్వారా వివిధ ప్రభుత్వ పథకాలకు, బ్యాంకు సేవలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సులభముగా పొందుటకు అవకాశం వుంటుందని చెప్పారు. తమ పేరు, ఐడి, చిరునామాకు సంబదించిన రుజువు పత్రములతో ఆధార్ అప్ డేట్ చేయించుకోవాలని చెప్పారు. పూర్తి వివరాలకు మీ దగ్గరలోని ఆధార్ కేంద్రానికి సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఎంయు అధికారి మల్లికార్జున, ఆధార్ సిబ్బంది నాగరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

విద్యార్థులకు టాబ్లులను ఇస్తున్న ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-అనంతగిరి:విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని అరకు శాసనసభ్యులు శెట్టి .పాల్గుణ, స్థానిక జడ్పిటిసి దీసరి గంగరాజు, ఎంపీపీ శెట్టి నీలవేణి, స్థానిక సర్పంచ్ సోమ్మెల రూతు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని బాలికల పాఠశాల వన్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి పెద్దపీట వేస్తుందని, నాడు నేడు, అమ్మ ఒడి, విద్యా, వసతి దీవెన వంటి వాటిని అమలు చేస్తుందన్నారు. జెడ్పిటిసి గంగరాజు, ఎంపీపీలు నీలవేణిలు మాట్లాడుతూ, మెరుగైన బోధనల అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏటిడబ్ల్యూఓ కూడా వెంకటరమణ, ఎంఈఓ వెంకటరావు, ప్రధానో పాధ్యాయులు జి.మల్లేశ్వరి. బి.మంగ, కె.భాస్కరరావు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: మండలంలోని పనసపుట్టు ఆశ్రమ బాలికల పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ట్యాబ్‌లను జెడ్పి చైర్ పర్సన్ సుభద్ర పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ట్యాబ్‌లతో ఉపాధ్యాయులకు మెరుగైన విద్యను అందించే అవకాశం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేద విద్యార్థికి కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో కిరణ్ కుమార్, ఎంఈఓ చెల్లయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం

స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ కవర్లు

ప్రజాశక్తి- ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో వనభసింగికి చెందిన వ్యాపారి వద్ద నుండి సుమారు రూ.5వేల విలువ చేసే నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వర్తక సంఘం ప్రతినిధులు సోనియా ప్రసన్నకుమార్, కాంతారి మోహన్‌లు సోమవారం పట్టుకున్నారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి గోపికి సమాచారం అందించారు. పట్టుకున్న ప్లాస్టిక్ కవర్లను వర్తక సంఘం ప్రతినిధులు సమక్షంలో పంచాయతీ కార్యదర్శి స్వాధీనం చేసుకున్నారు. వర్తక సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం మనిషి ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారుతుందన్నారు. ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించేందుకు ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు.ఎవరైనా నిషేధిత ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే జరిమానాలు విధిస్తామని ఆయన అన్నారు. ప్లాస్టిక్ రహిత మండలంగా తీర్చి దిద్దేందుకు ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని కోరారు.

ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పర్యటన

పథకాల బ్రోచర్ ఇస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-జి.మాడుగుల:మండలంలో గెమ్మెలి గ్రామ సచివాలయం పరిధి చీమలపాడు, కె.పెదబయలు, గిరిగోడిపాలెం, వరిగెలపాలెం, కర్లమామిడి, లువ్వాపల్లి, బలమానుశంక గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పాడేరు శాసన సభ్యురాలు భాగ్యలక్ష్మి నిర్వహించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు

జగన్ ప్రభుత్వాన్ని సాగనంపాలి

ఇదేం ఖర్మ రాష్టానికిలో నిరసన వ్యక్తం చేస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి-కొయ్యూరు

ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని జిసిసి మాజీ చైర్మన్ ఎంవివి.ప్రసాద్, జెడ్పి మాజీ చైర్‌పర్సన్ వంజంగి కాంతమ్మ ప్రజలను పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం టిడిపి నాయకులు ఇదే మీ కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని చేపట్టారు. కొయ్యూరు నుండి సింగవరం వరకు భారీగా ర్యాలీ నిర్వహించారు. వైసీపీ పాలనపై పలు విమర్శలు చేసుకుంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దొచ్చురి చిట్టిబాబు. బషీర్ ఖాన్, లోతా భీమరాజు, టిడిపి మండల నాయకులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల మరణాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

దీక్షలో కూర్చున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి-పాడేరు:పాడేరు ఐటిడిఎ పీవో గోపాలకృష్ణను తక్షణమే సరెండర్ చేయాలని ఐటీడీఏ వద్ద చేపట్టిన నిరాహార దీక్షలు సోమవారం ఎనిమిదో రోజు కొనసాగాయి. ఈ రిలే దీక్షలకు సిఐటియు మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో విద్యార్థుల వరస మరణాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ నిర్వహించాలని డిమాండ చేశారు. రిలే నిరాహార దీక్షలు ఎనిమిదో రోజుకు చేరినా కనీసం రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం చాలా దుర్మార్గమన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గిరిజనులు, గిరిజన ఉద్యోగులు, గిరిజన ప్రజా ప్రతినిధుల పట్ల గౌరవం లేని పాడేరు ఐటీడీఏ పిఓను తక్షణమే సరెండర్ చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులు, గిరిజన ఉద్యోగులు, గిరిజన ప్రజా ప్రతినిధులను అవహేళన చేస్తూ, వేధింపులకు గురి చేయడం తగదన్నారు. పెదబయలు తహసీల్దార్ ఆత్మహత్యపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. బాధ్యులు ఎంతటి వారైనా కఠినంగా చర్యలు తీసుకోవాలన్నారు. పాడేరు ఐటీడీఏ పీవోను రక్షించడం కోసం అమాయక ఉద్యోగులను బలి చేయడం సరికాదని, వారి సస్పెండ్‌ను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ చేశారు.

ఐక్యవేదిక కన్వీనర్ కే.రాధాకృష్ణ, కో కన్వీనర్ ప్రభుదాస్ మాట్లాడుతూ, విద్యార్థి, ప్రజా సంఘాలు, మీడియా ప్రతినిధులను గిరిజన విద్యా సంస్థల్లోకి ప్రవేశాన్ని నిరాకరిస్తూ గిరిజన సంక్షేమ ముఖ్య కార్యదర్శి జారీ చేసిన సర్కులర్ తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఐటిడిఎ పిఓను సరెండర్ చేసేంత వరకు ఉద్యమం ఆపేది లేదని, ప్రభుత్వం స్పందించకుంటే మరింత తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల వేదిక కోకన్వీనర్లు మువ్వాళ లక్ష్మణరావు, చిన్నారావు, కాదేలి చంటిబాబు, బత్తిరి నరేష్, పి.లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు ఉద్యోగాలకు శిక్షణ

శిక్షణ పొందుతున్న నిరుద్యోగులు

మాట్లాడుతున్న పిఒ

ప్రజాశక్తి - రంపచోడవరం : పోలీస్ శాఖలో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన యువతీ యువకులకు ఉచిత శిక్షణ, భోజన వసతి కల్పిస్తున్నట్లు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే తెలిపారు.

సోమవారం సాయంత్రం స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్లో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో రాత పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులను ఎంపిక చేసి వారికి 40 రోజులపాటు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.

ఈ శిక్షణకు 83 మంది మహిళలు, 258 మంది పురుషులు మొత్తం 341 మంది ఎంపిక చేసినట్లు తెలిపారు. పాడేరు, రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని గిరిజన అభ్యర్థులందరికీ ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ పోలీస్ శిక్షణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఐటిడిఎ ఎపివో శ్రీనివాస్‌ను ఆదేశించారు.

కార్మికుల ప్రాణాలకు భద్రత ఏదీ?

'లారస్' ప్రమాదంలో నలుగురు మృతి
ప్రమాద తీవ్రతను తక్కువచేసి చూపే ప్రయత్నం
ఆందోళనలో కార్మికులు

ప్రమాదంలో సజీవ దహనమైన కార్మికుడు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

పరవాడ ఫార్మా సిటీలో ప్రమాదాలు ఆగడంలేదు. భద్రతా చర్యలు తీసుకున్నామని యాజమాన్యం, ప్రమాణాలు పాటిస్తున్నారని సంబంధిత ప్రభుత్వశాఖాధికారులు చెబుతున్నా అవేవీ ప్రమాదాలను నివారించడంలేదు. ప్రాణాలను కాపాడ్డంలేదు. ఏ కంపెనీలో ఏ ప్రమాదం జరిగినా యాజమాన్యం తప్పిదాలను కప్పిపుచ్చే తరహాలో ఆయా శాఖాధికారుల నివేదికలుంటున్నాయి తప్ప వాస్తవ పరిస్థితిని వివరించి పొరపాట్లు సరిదిద్దే పని చేయడంలేదు. ప్రమాదాలకు కారణమైన యాజమాన్యంపై చర్యలు తీసుకున్న సందర్భాలూ చెప్పుకోదగినవిలేవు.

ఫార్మా సిటీలో లారస్ కంపెనీలోని మూడో యూనిట్‌లో సోమవారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఐదుగురిలో నలుగురు చనిపోయిన విషయం బయటకు పొక్కకుండా అటు యాజమాన్యం, ఇటు అధికారయంత్రాంగం చేయని ప్రయత్నం లేదు. కార్మికుల ఆరోగ్య పరిస్థితులపై సహచర కార్మికులు తల్లడిల్లుతుంటే వైద్యం కోసం నలుగురిని కెజిహెచ్‌కు, ఒకరిని కిమ్స్‌కు తరలించినట్లు కంపెనీ ప్రతినిధులు చెప్పుకొచ్చారు. మీడియాకు కూడా ఒకరి పరిస్థితి తీవ్రంగావున్నట్లు తప్పుడు సమాచారమిచ్చారు. సమయం గడుస్తున్న కొద్దీ ప్రమాదంలో గాయపడ్డ కార్మికుల్లో నలుగురు చనిపోయినట్లు బహిర్గతమైంది. ఈ విషయం బయటకు పొక్కాక అధికారయంత్రాంగం అప్రమత్తమైంది. కెజిహెచ్ పోస్టుమార్టం దగ్గరకు చేరుకొని పరిస్థితిని వివరించారు. లారస్ యాజమాన్యం మాత్రం ఇంతవరకు ప్రమాదంపై ప్రకటన చేయలేదు. జరిగిన ప్రమాదాన్ని తక్కువచేసి చూపి జారుకోవడానికి యాజమాన్యం చేసిన ప్రయత్నానికి, ప్రభుత్వ యంత్రాంగమూ సహకరించినట్లు కన్పించింది. ప్రమాదమెలా జరిగిందో ఫ్యాక్టరీ ఇనెస్పెక్టర్ ప్రకటించలేదు. ఈ తరహా ప్రమాదాలు తరచూ జరుగుతున్నప్పటికీ, ప్రాణాపాయం జరగకుండా భద్రతా చర్యలు పెంచడంలేదు. ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టి, యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ ప్రమాదంపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి పర్మినెంట్ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్‌చేశారు.

కోలగట్ల దంపతులకు ఆర్య వైశ్య మహాసభ సన్మానం



కోలగట్ల దంపతులను సత్కరిస్తున్న ఆర్య,వైశ్య మహాసభ ప్రతినిధులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామిని ఆర్య వైశ్య మహ సభ, వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రి 201 ఎ వారి ఆధ్వర్యాన వుడా చిల్డ్రన్స్ ఎరినాలో సన్మానించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరైన మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ, వీరభద్ర స్వామి స్వయంకృషితో రాజకీయాలలోఉన్నత స్థానాలకు చేరుకున్నారని కొనియాడారు.

మరికొందరు వక్తలు మాట్లాడుతూ కోలగట్ల వీరభద్ర స్వామి ఆర్యవైశ్యుల హృదయాలలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని తెలిపారు. మచ్చలేని నాయకుడని, 30 ఏళ్లుగా విజయనగరం రాజకీయాలలో నిస్వార్థ సేవలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పైడా కృష్ణప్రసాద్, శోభన్ ప్రకాష్, కంకటాల మల్లిక్, గ్రంధి మల్లిక, ఆర్య వైశ్య మహాసభ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీస్

జివిఎంసి కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న వెంకటరావు, కార్మిక సంఘ నేతలు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : జివిఎంసిలో పనిచేస్తున్న పారిశుధ్య, యుజిడి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన కమిషనర్ రాజాబాబుకు సమ్మె నోటీసులు అందజేశారు. యూనియన్ గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, అధ్యక్షులు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరికిటి రాజు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎంవి.ప్రసాదరావు నాయకత్వంలో సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మీడియాతో మాట్లాడుతూ, కౌన్సిల్ తీర్మానం ప్రకారం 60 సంవత్సరాలు దాటిన, అనారోగ్యంతో విధులకు రాలేకపోయిన వారి పిల్లలకు అవకాశం కల్పించాలన్నారు. కొత్తగా 482 మందిని అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పారిశుధ్య కార్మికులుగా నియమించేందుకు కలెక్టర్ ఇచ్చిన నోటిఫికేషన్ రద్దుచేయాలని, ఈ సరికే స్క్రీనింగ్ చేసిన వారిని తీసుకోవాలని డిమాండ్‌చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పారిశుధ్య, యుజిడి కార్మికులకు సేఫ్టీ పరికరాలు, రైన్ కోట్, మాస్కులు, గ్లౌజులు, సబ్బులు, నూనె, తాగు నీరు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ మూడేళ్లుగా ఇవ్వటం లేదన్నారు. అనారోగ్యంతో మరణించిన కార్మిక కుటుంబాలకు పరిహారం చెల్లించలేదని తెలిపారు. ఇఎస్ఐ చెల్లించనందున సరైన వైద్యాన్ని కార్మికుల పొందలేకపోతున్నారని చెప్పారు. మృతిచెందిన, 60 ఏళ్ల దాటిన, అనారోగ్యంతో ఉన్నవారికి రిటైర్మెంట్ బెనిఫిట్ అందటం లేదని, గ్రాట్యూటీ ఇవ్వటం లేదని తెలిపారు. నీటి సరఫరాలో టర్న్ కాక్, వాటర్ ఆపరేటర్, ఎలక్ట్రికల్ హెల్పర్, ఫిట్టర్ హెల్పర్, స్కిల్డ్ పనులు చేస్తున్న వారికి సెమీ స్కిల్డ్ వేతనాలు ఇవ్వాల్సి ఉందన్నారు. ఆప్కాస్‌లో చేరితే రూ.15 వేలు జీతం ఇస్తున్నారని చెప్పారు. వారికి రూ.18500 జీతం చెల్లించాలని కోరారు. క్లాప్ వాహనాల డ్రైవర్లకు రూ.18,500 చెల్లించాల్సి ఉన్నా ప్రస్తుతం రూ. 11,600 మాత్రమే ఇస్తున్నారని పేర్కొన్నారు. వీటితోపాటు మరికొన్ని డిమాండ్లను పరిష్కరించాలని, లేకుంటే నిరవధిక సమ్మెకు వెళ్లడం తధ్యమని స్పష్టంచేశారు. వినతి పత్రం సమర్పించిన వారిలో యూనియన్ నాయకులు గొలగాని అప్పారావు, ఇ.ఆదినారాయణ, బి.రత్నం, జె.నాయుడు, అనీల్, రాజు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై గిరిజన సంఘం, సిపిఎం ఫిర్యాదు

అరకు, హుకుంపేటల్లో తహశీల్దార్లకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం, గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి-హుకుంపేట:గిరిజనేతరుల అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వం చర్యలు చేపట్టక పోతే గిరిజనులతో తామే కూల్చేస్తామని గిరిజన సంఘం, సీపీఎం నాయకలు కే.రామారావు, టి.కృష్ణారావు, వి.లక్ష్మణరావు తెలిపారు. మండల కేంద్రంలో గిరిజనేతరులు విచ్చల విడిగా అక్రమ నిర్మానాలు చేపడుతున్నారని తహసిల్దార్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ, మండల కేంద్రంలో గిరిజనేతరులు విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు నోటీసులు ఇవ్వలేదని, నిలుపుదల ఎందుకు చేయలేదని వారు ప్రశ్నించారు. రెవెన్యు అధికారులు బినామీలను ప్రోత్సహిస్తూ గిరిజనేతరులకు భూములు అప్పనంగా అప్పజెప్పి సొమ్ము చేసుకుంటున్నారన్నారు.ఇప్పటికైనా పంచాయతీ, రెవిన్యూ అధికారులు చొరవ తీసుకొని నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు.

అరకులోయరూరల్: మండల కేంద్రంలోని పశుసంవర్థక శాఖ కార్యాలయం ఎదురుగా ప్రధాన రహదారికి ఆనుకొని ఆర్‌అండ్‌బి స్థలంలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను నిలుపుదల చేయాలని గిరిజన సంఘం మండల కార్యదర్శి పాంగి రామన్న, సీపీఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు డిమాండ్ చేశారు. అక్రమ కట్టడాలు నిలుపుదల చేయాలని తహశీల్దార్ వేణుగోపాల్‌కు గిరిజన సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, బహిరంగంగా అక్రమ కట్టడాల నిర్మాణం చేపడుతున్నా రెవిన్యూ అధికారులు పట్టించుకోలేదన్నారు.పంచాయతీలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించినట్లయితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రత్యేక ప్రకటన ఇచ్చి అధికారికంగా భూమి పూజ చేసిన తర్వాత భవనాలు నిర్మించాల్సి ఉంటుందన్నారు. ఎటువంటి ప్రకటనలు లేకుండా రహస్యంగా రాత్రికి రాత్రి నిర్మాణాలు చేపట్టడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు.తక్షణమే దీనిపై విచారణ చేపట్టి అక్రమ కట్టడాలను నిలుపుదల చేయాలని, లేని పక్షంలో ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

సమగ్రంగా భూసర్వే

సర్వే ప్రారంభిస్తున్న అధికారులు

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు : 1మండలంలో వనభ సింగి పంచాయతీ లుంగపుట్టు గ్రామంలో సమగ్ర భూ రీ సర్వే నిర్వహించేందుకు స్థానిక సర్పంచ్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో తహసిల్దార్ నర్సమ్మ గ్రామ ప్రజలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీసిల్దార్ మాట్లాడుతూ, భూ యజమాని అంగీకారంతోనే రీ సర్వే నిర్వహిస్తామన్నారు. భూ తగాదాలు ఉన్న చోట్ల తాత్కాలికంగా రీ సర్వేలు నిలుపుదల చేయాలని సూచించారు. భూ పట్టాదారునితో పాటు, ం1ఇరుగు పొరుగు యజమానులు కూడా రీ సర్వే జరిగే సమయంలో అందుబాటులో ఉండాలన్నారు. జాప్యం జరగకుండా సమగ్ర సర్వే నిర్వహించాలన్నారు. సర్వేలో ఏ విధమైన అవకతవకలు జరిగినా తహసిల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని ప్రజలకు తెలిపారు. అనంతరం రీ సర్వే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్ఐ రవికుమార్, వీఆర్వో కనకరత్నం, సచివాలయ సర్వేయర్ వి.వీరన్న పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి-డుంబ్రిగూడ:మండలంలోని ఖండ్రుం పంచాయతీ స్వర్ణాయిగూడ గ్రామంలో రూ.3 లక్షలతో కల్వర్టు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో, సోమవారం స్థానిక పంచాయతీ సర్పంచ్, సర్పంచ్ పోరం మండల అధ్యక్షుడు కే.హరి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇటీవల గడప గడపకు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పంచాయతీకి రూ.20 లక్షల నిధులను కేటాయించగా స్వర్ణాయిగూడ గ్రామంలో కల్వర్టు నిర్మాణానికి రూ 3 లక్షలు కేటాయించినట్లు ఆయన చెప్పారు. పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో రోడ్డు, కల్వర్టుల నిర్మాణానికి ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ ఎస్.ఆనంద్, వార్డు సభ్యులు పి.గున్మోతి, పి.శోభన్‌బాబు, సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు

విశ్వవ్యాప్త పండుగ క్రిస్మస్

మాట్లాడుతున్న దొన్నుదొర

ప్రజాశక్తి-హుకుంపేట: విశ్వవ్యాప్తంగా జరిగే అతి పెద్ద పండుగ క్రిస్మస్ అని టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర అధ్యక్షులు సివేరి దొన్నుదొర పేర్కొన్నారు. పట్టాం పంచాయతీ భూరువలస చర్చిలో పాస్టర్ ప్రేమ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలలో పాల్గొన్న ఆయన క్రిస్మస్ వేడుకలలో తనను భాగస్వామ్యం చేయడం చాలా అనందంగా ఉందన్నారు. ప్రజల పట్ల యేసు చూపిన ప్రేమ గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు దేవా, మోహన్, రాజారావు, ఫిలిప్పు, సమూయేలు, టిడిపి అరకు అసెంబ్లీ నాయకులు బొడ్డ శ్యామ్, ఎస్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ సంతోష్ కుమార్, వెంకట రమణ పాల్గొన్నారు.

సిపిఐ వ్యవస్థాపక దినోత్సవం

నినాదాలు చేస్తున్న సిపిఐ నేతలు

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని రాజేంద్రపాలెంలో సీపీఐ వ్యవస్థాపక దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు ఇరువాడ దేవుడు, కనకరాజు, భవాని, సత్యనారాయణ పాల్గొన్నారు.